అక్కచెల్లెమ్మలకు.. ఆరోగ్య సిరి

- గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య కిట్లతో మేలు
- భావితరాల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

అంగన్‌వాడీల్లో మెనూ ఇలా..

సోమవారం	ఆనపకాయ, పప్పు
మంగళవారం	పులిహోర, సాంబారు
బుధవారం	అన్నం, ఆకుకూర పప్పు
గురువారం	అన్నం, ఆకుకూర
శుక్రవారం	సాంబారు అన్నం
శనివారం	బిర్యానీ, పప్పు


పండావీధి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణికి వైఎస్సార్ పోషణ ప్లస్ కిట్ అందిస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు ఒక గుడ్డు, ఒక్క పాల ప్యాకెట్ మాత్రమే ఇచ్చేరోజులు పోయాయి. జగనన్న ప్రభుత్వం వచ్చింది. ఆలనా పాలనా లేకుండా వదిలేసిన అంగన్‌వాడీ కేంద్రాలను మోడరన్ ప్రీ చిల్డ్రన్ స్కూళ్లగా తీర్చేదిద్దడమే కాకుండా వారికి ఇచ్చే మెనులో అనేక మార్పులు చేశారు. బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లు అందిస్తూ భావితరాన్ని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నారు. గర్భిణులు, బాలింతలకు టేక్ హోం కింద ఇంటికే సరకులు పంపిణీ చేస్తున్నారు. చిన్నారులు, నవజాత శిశువులు రక్తహీనతతో బాధపడకుండా ఉండాలనే ఆకాంక్షతో డ్రై రేషన్ అందిస్తున్నారు.

జీవీఎంసీ 35వ వార్డులో..

జీవీఎంసీ 35వ వార్డులోని అర్బన్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోకి వచ్చే కల్లుపాకలు-2, పండావీధి-1 , ప్రసాద్‌గార్డెన్స్-2, వెలంపేట-1, మేదరవీధి-1, పువ్వులవీధి-1 కేంద్రాల్లో సుమారు రెండు వందల మంది చిన్నారులు, 66 మంది గర్భిణులు, 69 మంది బాలింతలు ఉన్నారు. వీరందరికీ గతంలో భోజనాలు వండి పెట్టేవారు. ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో ఇంటికే రేషన్ పంపిణీ చేస్తున్నారు. అంతే కాకుండా ఇప్పటికే 6 నెలల నుంచి రెండేళ్లలోపు పిల్లలకు రెండున్నకేజీల బాలామృతం, నెలకు 25 గుడ్లు, రెండున్న లీటర్ల పాలు అందిస్తున్నారు. పిల్లలకు స్కూల్లో రోజుకు 100 మి.లీ. పాలు, ఉడికించిన గుడ్డు అందిస్తున్నారు.

బాలింతలకు మొదటి విడత..

15 రోజులకు ఒకసారి ఒకటో తేదీ నుంచి 5వ తేదీ లోపు వైఎస్సార్ కిట్టు, వైఎస్సార్ బ్యాగ్‌తో పాటు రెండు కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, పావుకేజీ బెల్లం, పావుకేజీ బెల్లం చెక్కీలు, పావుకేజీ ఖర్జూరం, 3 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అరకేజీ నూనె, 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందజేస్తున్నారు. అలాగే రెండవ విడత కూడా అందజేస్తున్నారు.

ప్రభుత్వ సేవలు బాగున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు బాగున్నాయి. అంన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తెచ్చుకునే రోజులు పోయాయి. ఇంటి వద్దకే పోషణ కిట్లు పంపిణీ చేయడం బాగుంది.
–కొత్తల వరలక్ష్మి, బాలింత, పండావీధి, 39వ వారు.

రేషన్ సరకులు పెరిగాయి



వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్ల ద్వారా అందించే సరకులు పెరిగాయి. గతంలో భోజనం పెట్టి పంపించేవారు. ఇప్పుడు పాలు, 25 గ్రుడ్లతో పాటు ఆరు రకాల పోషణ సరకులు అందిస్తున్నారు.
–వరి సన్యాసమ్మ, గర్భిణి, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు.

'టేక్ హోం' బాగుంది



నా లాంటి బాలింతలకు టేక్ హోం ద్వారా ప్రభుత్వం ఇంటికి పోషణ కిట్లు పంపిస్తుంది. డ్రై రేషన్ వల్ల రక్తహీనత బారిన పడకుండా రక్షించుకోవచ్చు. జగనన్న మాలాంటి వారి కోసం తీసుకుంటున్న జాగ్రత్తలకు వారికి కృతజ్ఞతలు.
–జగ్గా భవానీ, బాలింత, పండావీధి, 35వ వార్డు.

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ


అచ్చియ్యమ్మపేటలో ఎమ్మెల్యే వాసుపల్లికి వినతులు అందజేస్తున్న 32వ వార్డు ప్రజలు


జామియా మసీదు ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

- పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

అల్లిపురం : జీవీఎంసీ 32వ వార్డు పరిధి నేరెళ్ల కోనేరు, అల్లిపురం ప్రాంతంలో అధికారులు వైన్ షాప్ పెట్టేందుకు సిద్ధపడుతున్నారని, దానిని తక్షణమే నిలుపుదల చేయాలని వార్డు ప్రజలు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వినవించారు. శుక్రవారం అచ్చియ్యమ్మపేట, డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వారు పాల్గొని వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన స్పందించి ఎక్సైజ్ శాఖ అధికారులతో మాట్లాడి వైన్ షాపు ఏర్పాటు వద్దని ఆదేశించారు. జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌తో మాట్లాడి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ మంజూరు చేయొద్దని ఆదేశించారు. చలువతోటలో వాటర్ సప్లై వేళలు మార్చాలని కోరటంతో అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. కార్యక్రమంలో 34వ వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, వాసుపల్లి నారాయణరావు, తాతబ్బాయి, సుబ్రహ్మణ్యం, బొర్రా శ్రీనివాసరెడ్డి, బొడ్డేటి కిషోర్, దూడ అప్పారావు, బోణి దేవ, నీలబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే 36వ వార్డు జామియా మసీదు వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్టీలు బెహరా వెంకటరత్నం, మీసాల అశోక్‌కుమార్, ముస్లిం నాయకులు బాబ్జి, రఫీ, ముస్తఫా, ఫైజార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాసారపు వాసు, బొగ్గ శ్యామ్, వడ్డాది దిలీప్, కుందేటి సుధాకర్, దశమంతుల చిన్న, కడియం ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత


కేజీహెచ్‌లో రాజ్యలక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ కళావతి

మహారాణిపేట : శ్రీనివాస్‌నగర్‌కు చెందిన దాడి రాజ్యలక్ష్మి అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ఈ నెల పింఛన్ అందించాల్సి ఉండగా వలంటీర్ కె.కళావతి ఆమె గురించి తెలుసుకుని శుక్రవారం కేజీహెచ్‌లోని రాజేంద్రప్రసాద్ వార్డులో ఉన్న రాజ్యలక్ష్మికి వితంతు పింఛన్ అందజేశారు. ఆసుపత్రిలో ఉన్న తనను వెదుక్కుంటూ వచ్చి పింఛన్ అందించిన వలంటీర్ కళావతి సేవా నిరతికి రాజ్యలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

దోపిడీ ముఠాల హల్‌చల్

సీతమ్మధార: నగరంలోని పలు ప్రాంతాల్లో దోపిడీ ముఠాలు హల్‌చల్ చేస్తున్నాయి. విధులు ముగించుకుని అర్ధరాత్రి వేళ ఇంటికి వెళ్తున్న వారిపై దొంగలు దాడి చేస్తున్నారు. నగదు, నగల కోసం దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇవ్వలేని పక్షంలో విచక్షణా రహితంగా దాడులు చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి ఇదే తరహాలో ఘటన జరిగింది. డైమండ్ పార్కు సమీపంలో ఒక వ్యక్తి షాపు క్లోజ్ చేసి ఇంటికి వెళ్తున్న సమయంలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన ముగ్గురు యువకులు అతడిని అడ్డగించి బెదిరించారు. ఆ సమయంలో షాపు యాజమానికి సంబంధించిన వ్యక్తులు వెనుక నుంచి రాగానే ఆ ముగ్గురు పరారయ్యారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై రాత్రి పూట తిరుగుతున్నట్లు సమాచారం. విషయం తెలుసుకుని పోలీసులు రాత్రి పూట గస్తీ పెంచారు. ఆ ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. వెస్ట్ బెంగాల్ నుంచి పలు చోట్ల పనులకు వచ్చిన వారిపై నిఘా పెట్టారు. హోటళ్లు, నూడిల్స్ పాయింట్‌ల వద్ద ఎక్కువ శాతం వెస్ట్ బెంగాల్‌కు చెందిన యువకులు పని చేస్తుంటారు. వీరిపై పోలీసులు దృష్టి పెట్టినట్లు సమాచారం.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం


వెంకన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: వెంకటాద్రిపై శుక్రవారం వెంకన్న కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చాతుర్మాస్య పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టలతో ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: మురళీనగర్–మాధవధార వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలమ కుటుంబాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారా లు అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారు, పదో తరగతి పాసైనవారు, వివిధ సాంకేతిక విద్యా పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు పొందిన వెలమ సామాజిక వర్గ విద్యార్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మురళీనగర్‌లోని వెలమ సంక్షేమ సంఘం కార్యాలయంలో లేదా 99496 57734 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

వారంలో ఒక రోజు డ్రై డే పాటించండి


నీట్లో దోమ లార్వాల కోసం పరిశీలిస్తున్న మలేరియా, ఆశ వర్కర్లు

అల్లిపురం : దోమల నివారణకు వారంలో ఒక రోజు డ్రై డే పాటించాలని భీమ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మలేరియా సిబ్బంది, ఏఎన్ఎం కాంతం, ఆశ వర్కర్ ఎ. సరోజ, వలంటీర్ తులసి సూచించారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా 32వ వార్డు చలువతోట, నేరెళ్లకోనేరు తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. నీటి ట్యాంకులను ఖాళీ చేసి ఆరనివ్వాలని, మంచి నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని, వాడేసిన కొబ్బరి బొండాలు నిలువ ఉంచరాదని, పాత టైర్లు ఇంట్లో ఉంచరాదని, దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలిపారు. డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న గుంతల్లో క్రిమిసంహారక మందులు, కిరోసిన్ వేయాలన్నారు. వాడిన ఇంజిన్ ఆయిల్‌లో గుడ్డ ముంచి ఉండగా చేసి ఆ గుంతలో వేస్తే దోమ లార్వాలు చనిపోతాయన్నారు. మురుగు నీరు ఎప్పటికప్పుడు వెళ్లిపోయే విధంగా చర్యలు తీసుకోవాలని, నీటి ట్యాంకులు, డ్రమ్ములపై మూతలు సరిగా ఉంచాలని, కిటికీలు, డోర్లకు జాలీలు బిగించుకోవాలని, వ్యక్తిగత రక్షణకు దోమతెరలు, కాయిల్స్ వాడాలని, శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గం నాయకులు సీతంరాజు సుధాకర్ సహకారంతో శనివారం 33వ వార్డు బంగారుమెట్ట కమ్యూనిటీ హాల్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పార్టీ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభం అవుతుందని ఆయన పేర్కొన్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వార్డు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


జీలకర్ర,బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు రోటరీ క్లబ్ వితరణ


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న అతిథులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని రోటరీ క్లబ్, విశాఖపట్నం సౌత్ క్లబ్‌లలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్తా) శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా చట్టివానిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాపీరైటింగ్ పుస్తకాలను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధి ఉమా మహేశ్వరరెడ్డి తమ క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ బ్రహ్మానందం, కార్యదర్శి వెంకట గిరి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు సివిల్స్‌లో శిక్షణ

- ఆర్ట్స్ కళాశాలలో ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటు
- ఆర్ట్స్ కళాశాల విభాగం ఆధునికీకరణకు దిశా నిర్దేశం


విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సివిల్స్ వంటి యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేంకగా ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేస్తామని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్ట్స్ కళాశాల భవనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో పలు గదులు ఖాళీగా ఉండటాన్ని గమనించారు. గతంలోనే ఈ గదులను ఖాళీ చేసి ప్రిన్సిపాల్‌కు అప్పగించాలని సూచించినా ఎందుకు చేయలేదని విభాగాధిపతులను ప్రశ్నించారు. వెంటనే ఖాళీ గదులను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆర్ట్స్ కళాశాల మొదటి అంతస్తులో యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయుక్తంగా ఐఏఎస్ స్టడీ సెంటర్‌ను నెలకొల్పడానికి అనువుగా ఉంటుందని సూచించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టాలని పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజుకు సూచించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన భవనంలో అవసరమైన మరమ్మతులు చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవనానికి నూతనంగా లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్న స్థలాన్ని పరిశీలించారు. భవనంలో టాయిలెట్స్ మరమ్మతులు, విద్యార్థినుల రెస్ట్ రూమ్‌లో వసతులు పెంచాలని చెప్పారు. టాయిలెట్స్ శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలన్నారు. త్వరలో భవనానికి పూర్తి స్థాయిలో పెయింటింగ్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు, ఆర్కిటెక్ భీమేష్, విభాగాధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: యువత తమ కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా ఎదగాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో రెండో రోజు విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ భావ వ్యక్తీకరణ నైపుణ్యా లు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్దిష్ట లక్ష్యంతో పని చేస్తూ ఉన్నత భవిష్యత్‌ను సొంతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ రాములు, డాక్టర్ జె.ప్రసాద్ పాల్గొన్నారు.

ఐపీఆర్ క్విజ్ విజేతలకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచ మేధో హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూలోని డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 900 మందికిపైగా విద్యార్థులు పోటీ పడ్డారు. ఏయూ బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఎ.వైష్ణవి ప్రథమ, చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.భాస్కరరావు ద్వితీయ, ఏయూ సీఎస్ ఈ విద్యార్థిని ఎం.హేమప్రేరణ తృతీయ బహుమతిని సాధించారు. విజేతలకు ఏయూ వీసీ తన కార్యాలయంలో ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేసి అభినందించారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపనిషత్తుల్లో ఆత్మతత్వ జ్ఞానం


ప్రసంగిస్తున్న దేవులపల్లి పద్మజ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న ఆధ్యాత్మిక లహరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఉపనిషత్తుల వైశిష్ట్యంపై రచయిత్రి దేవులపల్లి పద్మజ ప్రసంగించారు. ముందుగా ముఖ్య అతిథి పూర్ణానంద స్వామి ఉపనిషత్తులను పరిచయం చేశారు. చివరిగా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. ఉపనిషత్తులు వేదాంతమని, అనేత సత్యాలను, ఆత్మతత్వాన్ని లోకానికి రుషులు అందించారని ఉపదేశించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సారథ్యంలో వక్త పద్మజను సన్మానించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

- ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి

అల్లిపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపికృష్ణ అన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత అరగంటలోపు వచ్చే పాలను ముర్రుపాలు అంటారని తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అమ్మవారివీధి అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మవారివీధి, బంగారుమెట్ట, స్ప్రింగ్‌రోడ్డు, కుమ్మరవీధి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు పట్టించడంతో బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. బిడ్డ రోగాల బారిన పడకుండా రక్షణ కవచంలా పని చేస్తాయన్నారు. పుట్టిన బిడ్డకు తల్లి పాలు పడితే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పసిపిల్లలకు అమృతం వంటి తల్లిపాలు, వాటి విశిష్టతపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకుడు భీశెట్టి రాజు, ఆదారి వెంకట మహేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, సరిత, రాణి పుష్పవల్లి, నాగేశ్వరి, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కూరగాయల పంపిణీ


పేదలకు కూరగాయలు పంపిణీ చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

జగదాంబ : స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదలకు శుక్రవారం కూరగాయలు పంపిణీ చేశారు. జీవీఎంసీ 39వ వార్డులో సంస్థ గౌరవ అధ్యకుడు డాక్టర్ జహీర్ అహ్మద్ ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనికులున్న చోట రైతుబజార్లు పెట్టి తక్కువ ధరలకు అందిస్తున్నారన్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు ఉన్న పాతనగరంలో రైతుబజార్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూరగాయలు, టమాటాల ధరలు పెరిగిపోవడంతో కొనుక్కోలేని పరిస్థితిల్లో ఉన్నారన్నారు. గతంలో దక్షిణ నియోజకవర్గంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేసినా పట్టించుకోలేదన్నారు. ఆధార్ కార్డు ఉన్న వారికి రైతుబజార్‌కు వెళితే సబ్సిడీ కింద ఇస్తున్నారన్నారు. రోజువారీ కూలీలు ఇంత ఖరీదైన కూరగాయలను ఎలా కొనుక్కోగలరని ప్రశ్నించారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే 100 మంది పేదలకు టమాటాలు, కూరగాయలు పంపిణీ చేస్తున్నట్లు జహీర్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఛైర్మన్ మక్సూద్ అహ్మద్, వివేకానంద స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

'అమృత భారత్'కు దువ్వాడ రైల్వేస్టేషన్ ముస్తాబు


దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద శిథిలమైన రహదారిని పునర్నిర్మాణం చేస్తున్న సిబ్బంది

అగనంపూడి : అమృత భారత్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు ఆదివారం భూమి పూజ చేయనున్నారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ ఆరు బయట వేదిక ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్చువల్ పద్ధతిలో ప్రధానమంత్రి మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొననున్న నేపథ్యంలో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు ఐదు వేల మందికి సరిపడా వేదికను ఏర్పాటు చేశారు. కార్ల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని శుభ్రం చేశారు. ముఖ ద్వారానికి ముందు ఉన్న రహదారిని పునర్నిర్మిస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది పహరా కాస్తూ వచ్చిపోయే ప్రయాణికులను తనిఖీలు చేస్తున్నారు.

కళలను ప్రోత్సహించడంలో విస్కా కృషి భేష్


సాంస్కృతిక విజయోత్సవాలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: సాహిత్యం, నృత్యం తదితర కళలను, కళాకారులను ప్రోత్సహించడంలో విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) కృషి ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చీ అన్నారు. విస్కా ఆవిర్భవించి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న సాంస్కృతిక విజయోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాగ్చీ మాట్లాడుతూ నలభై ఏళ్ల పాటు అనేక కార్యక్రమాల ద్వారా కళాభిమానులను అలరించిన విస్కా భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. విస్కా అధ్యక్ష, కార్యదర్శులు నేమాని శ్రీనివాసశర్మ, ఎ.కేశవరావు మాట్లాడుతూ అందరి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా నాట్యోపాసన పురస్కార గ్రహీత డాక్టర్ లావణ్య శిష్యబృందం ప్రదర్శించిన భరత నాట్యం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉక్కు విశ్రాంత డైరెక్టర్ ఎస్.ఎస్. రావు, లాస్య నృత్యాలయ స్థాపకురాలు డాక్టర్ లావణ్య, డి.ఆదినారాయణ, కళాక్షేత్రం కార్యదర్శి సత్యనారాయణ, విస్కా కార్యవర్గ సభ్యులు జి.ఎస్.ఆర్. కిషోర్, డి. దుర్గాప్రసాద్, ఈరంకి శ్రీనివాస్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.